మానేరు

# జనత ®

తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

05.03.2025
బుధవారం Wednesday

సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 322

పేజీలు : 8
Pages : 8

Published from : Karimnagar



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్






స్పోర్ట్స్ పేజీలో..

# ఫైనల్‌కు భారత్

## సెమీ ఫైనల్‌లో ఆసీస్‌పై 4 వికెట్ల తేడాతో ఘన విజయం

2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. 265 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 6 వికెట్లు కోల్పోయి 48.1 ఓవర్లలో ఛేదించింది. రాహుల్ (42*) మ్యాచ్ ముగించాడు. విరాట్ కోహ్లీ (84 పరుగులు) సూపర్ హాఫ్ సెంచరీతో అదరగొట్టగా, అయ్యర్ (45) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా 2, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కూపర్ కనోలీ ఒక్కో వికెట్ పడగొట్టారు. 265 పరుగుల లక్ష్య ఛేదనలో గిల్ (8) ఫెయిల్ అయ్యాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (28 పరుగులు), అక్షర్ పటేల్ (27 పరుగులు) ఫర్వాలేదనిపించారు. చివర్లో హార్దిక్ పాండ్య (28 పరుగులు) రాణించాడు.

- 2023 ప్రపంచకప్ ఫైనల్ ప్రతీకారం తీర్చుకున్న రోహిత్ సేన
- అర్ధ సెంచరీతో రాణించిన కోహ్లీ
- సిక్సర్‌తో విన్నింగ్ షాట్ కొట్టిన రాహుల్

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన బోర్డు

మొత్తం 1,532 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ

నిముషం నిబంధన ఎత్తివేత..
5 నిముషాల వరకు అనుమతి



02

# బియ్యం బకాయిలు రిలీజ్ చేయండి

## కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రిక్వెస్ట్



- సీఎంఆర్ డెలివరీ గడువును పొడిగించాలని వినతి
- రేషన్‌కోటా పెంచాలని సీఎం విజ్ఞప్తి
- సౌర విద్యుత్ పై సబ్సిడీ ఇవ్వాలని కోరిన మంత్రులు
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో రేవంత్ రెడ్డి మరోసారి సమావేశమ య్యారు. ధాన్యం బకాయిలు రూ. 1, 468.94 కోట్లను విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ. 343. 27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**న్యూ ఢిల్లీ జనతా న్యూస్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండో రోజు ఢిల్లీ పర్యటన బీజీబిజీగా కొనసాగుతోంది. హస్తిన పర్యటనలో భాగంగా కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిశారు. ఆయన వెంట మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నారు. అరగంట పాటు సాగిన ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరినట్లుగా సమాచారం. మిగతా 2 లో



02

# కేసీఆర్‌పై హైకోర్టులో పిటిషన్!

అసెంబ్లీకి రావడం లేదని ప్రజాప్రయోజన వ్యాజ్యం



02

# డీలిమిటేషన్‌తో ఎంపీ సీట్లు తగ్గవు

త్వరలో రాష్ట్రాలకు అధ్యక్షులు..
బీజేపీ ఎంపీ లక్ష్మణ్

# హరీష్ రావుకు హైకోర్టులో ఊరట

12 వరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం




02



02

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

సుప్రీం ధర్మాసనం నోటీసులు
విచారణ 25కు వాయిదా



.. వివరాలు 4లో

# పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని

పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు.

# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

## ఆదిలాబాద్ సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం

నమ్మి ఓట్లేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి
కార్మికుల ఆవేదన, ఆర్తనాదాలు వినిపించడం లేదా : కేటీఆర్



03



02

# మామునూరు వద్ద తీవ్ర ఉద్రిక్తత

భారీగా తరలివచ్చిన రైతులు..
మహిళలతో కలిసి ఆందోళన
భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్



# అంబులెన్స్‌లో కుక్కలు

## సైరన్ మోగిస్తూ స్పీడ్‌గా వెళ్లిన డ్రైవర్

ఆపి తనిఖీ చేసిన పోలీసు అధికారులు

వాహనాన్ని సీజ్‌చేసిన పోలీసులు

'వేసక్టమీ' ఆపరేషన్ కోసం అంబులెన్స్‌లో పెంపుడు కుక్క తరలింపు

04

మానేరు
జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
బుధవారం 5 మార్చి 2025


# బియ్యం బకాయిలు రిలీజ్ చేయండి

మొదటి పేజీ తరువాయి

దాదాపు అరగంట పాటు కొనసాగిన చర్చల్లో 2014-15 గాను సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయాలని కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యం బకాయిలు రూ. 343.27 కోట్లు విడుదల చేయడంతోపాటు సీఎంఆర్ డెలివరీ గడువును పొడిగించాలని కోరారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ జరగలేదు. ఈ క్రమంలోనే కార్డుల జారీకి రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. ఎన్నికల కోడ్ ముగియనుండటంతో దీనిపై ముందడుగు వేయాలని భావిస్తోంది. ఎల్లుండి రాష్ట్ర కేబినెట్ భేటీ జరగనున్న నేపథ్యంలో ఈ అంశాన్ని కేంద్రమంత్రి దృష్టికి సీఎం తీసుకువెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కోటా పెంచాలని సీఎం విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది.



### సౌర విద్యుత్ పై సబ్సిడీ ఇవ్వండి

ఇక రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ భేటీ విషయమై మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా కేంద్రం నుండి తెలంగాణకు సుమారు రూ.2,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. గతంలో సంబంధిత పత్రాలను సమర్పించలేదని.. ఇప్పుడు తాము అవసరమైన పత్రాలను సమర్పించామని, అలాగే వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే, సౌర విద్యుత్ పై సబ్సిడీ కోరినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. 'ప్రధాని కుసుమ్' పథకం కింద మహిళ సంఘాలకు 4,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, దీనికి సబ్సిడీ ఇవ్వాలని కోరినట్లు ఆయన వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో సబ్సిడీతో సహా, సోలార్ పంపులను అందించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వీటి పై సానుకూలంగా స్పందించి, మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# డీ లిమిటేషన్‌తో ఎంపీ సీట్లు తగ్గవు

## త్వరలో రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు.. ● బీజేపీ ఎంపీ లక్ష్మణ్



**హైదరాబాద్, మార్చి 4:** డీలిమిటేషన్ ద్వారా దక్షిణాదిలో ఒక్క పార్లమెంట్ సీటు కూడా తగ్గదని ప్రధాని మోదీ చెప్పారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. జనగణన చేసిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ లక్ష్మణ్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 2011తో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో జనాభా తగ్గింది. జనాభా తగ్గినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గవు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో 153 సీట్లు తెలంగాణలో పెంచాలని పెట్టారు. దక్షిణాది వ్యక్తికి జాతీయ అధ్యక్ష పదవి అని ఎక్కడా చర్చలేదు. 11 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాం.. త్వరలోనే అన్ని రాష్ట్రాలకు ప్రకటిస్తాం. డీపీఆర్ సర్వే సక్రమంగా చేయకపోతే ట్రిపుల్ ఆర్ వెనుకకు వెళ్తుంది. భారాస చేసిన తప్పునే కాంగ్రెస్ చేస్తే ఎట్లా? బీసీల్లో 10శాతం ముస్లింలను కలపకపోతే ఆమోదిస్తాం. కులగణన తప్పుల తడకగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు. భాజపా బలం పెరుగుతుందని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుంది. ఆయనే మిగతా నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాం. సీఎం మార్పు అనేది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం. జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతోంది.. ఇప్పటికే రెండు మూడు సమావేశాలు జరిగాయి. కుల గణన చేపట్టి రేవంత్ రెడ్డి ఏ ఒక్కరిని సంతృప్తి పరచలేదని లక్ష్మణ్ అన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

## నోటీసులు జారీ చేసిన సుప్రీం ధర్మాసనం.. ● విచారణ 25కు వాయిదా

**న్యూఢిల్లీ, మార్చి 4 :** బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాసిహ్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది.

# కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు

## హైకోర్టులో విజయ్‌పాల్‌రెడ్డి పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, మార్చి 4 :** భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే చట్టప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా.. ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కోర్టులు జోక్యం చేసుకోవచ్చని.. ఈ మేరకు వాదనలు వినిపించడానికి గడువు కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో.. విచారణను కోర్టు 2 వారాలకు వాయిదా వేసింది.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుక

## మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ అద్దె బస్సులు

## జీవో జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 4:** అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళ సమాఖ్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అందుకు సంబంధించిన జీవోను రేవంత్ సర్కార్ జారీ చేసింది. తొలి విడతలో 150 మహిళా సమాఖ్యలకు 150 ఆర్టీసీ బస్సులు కేటాయించనున్నారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె కింద రూ. 77,220 చెల్లించనుంది. ఇక బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ సైతం ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడపనున్నాయి. ఆ రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్ని.. ఈ బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అ÷-దదె బస్సులను కేటాయించనున్నారు. మరోవైపు సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తు?న్నారు. అయితే ఈ పథకం వల్ల రాష్ట్రంలోని మహిళలు.. ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక అంతకు ముందు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. క్కడ సైతం ఆ పార్టీ అధికారంలోకి రావడంతో.. తెలంగాణలో సైతం తమ పార్టీ అధికారంలోకి వస్తే.. ఈ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. దీంతో తెలంగాణ ఓటరు సైతం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీని అమలు చేస్తోంది. దీంతో మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించడం.. తెలంగాణ మహిళలకు శుభవార్తగా పరిగణించాలి.



# అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలు

## స్థలాలు కేటాయించాలంటూ ఛైర్మన్ లేఖలు

**తిరుమల, మార్చి 4:** దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు.. సమాజ అభివృద్ధికి దోహదపడతాయి. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఆధ్యాత్మికత వైపు అందరూ అడుగులు వేస్తున్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండాలి. కోట్లాది మంది భక్తులు దేవాలయాలకు విరాళాలు ఇస్తున్నారు. వాటిని విద్య, వైద్యం సహా ఇతర సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నాం. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు దేవాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని లేఖలో పేర్కొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, మార్చి 4:** తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.. మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555 ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమైనాయి. మార్చి 1వ తేదీ నుంచి మొదటి సంవత్సరం, మార్చి 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు.. హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకొనేందుకు వాట్సప్ నెంబర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

### ఇంటర్ విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలకు హాజరువుతున్న విద్యార్థులు ఆత్మసైర్థ్యంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎటువంటి టెన్షన్‌కు లోనుకాకుండా అధికారులు నిర్దేశించిన సమయానికి అర్ధగంట ముందుగానే పరీక్షా హాల్‌కు చేరుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తగిన ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా ఉంటూ మీ వంతు కృషి చేయండి అని కేటీఆర్ సూచించారు. మీ కష్టానికి తప్పకుండా అద్భుతమైన ఫలితాలు వస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు.

### ఇంటర్ విద్యార్థులకు కవిత ఆల్‌దిబెస్ట్

కష్టంతో కాకుండా ఇష్టంతో పరీక్షలు రాయాలని ఎమ్మెల్సీ కవిత విద్యార్థులకు సూచించారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ నేపథ్యంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కవిత కోరుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు కవిత ఆల్ ది బెస్ట్ చెప్పారు.





# మామునూరు వద్ద తీవ్ర ఉద్రిక్తత

## భారీగా తరలివచ్చిన రైతులు.. మహిళలతో కలిసి ఆందోళన

## భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్

**హైదరాబాద్, మార్చి 4:** మామునూరు ఎయిర్‌పోర్టు సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అన్నదాతలు మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. నక్కలపల్లి రోడ్డు తీసేయవద్దని డిమాండ్ చేశారు. తమకు రోడ్డు మార్గం చూపాలని ఆందోళనకు దిగారు రైతులు. ఆందోళనలో భారీగా మహిళలు పాల్గొన్నారు. సమాచారం అందిన వెంటనే మామూనూరు ఎయిర్-పోర్టు వద్దకు భారీగా పోలీసులు మోహరించారు. మామునూరు ఎయిర్‌పోర్టు రావడం సంతోషకరమే అయినా భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మాములూరుకు సమీపంలో ఉన్న గవిచర్ల క్రాస్ రోడ్డు మీదుగా నక్కలపల్లి, గుంటూరుపల్లి, నెక్కొండ వెళ్లే ప్రధాన రహదారి మొత్తం ఎయిర్‌పోర్టులో కలిసిపోతుంది. రహదారి మూసివేస్తుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కలపల్లి ప్రధాన రహదారిపై రైతులు ఆందోళనకు దిగారు. ఎయిర్‌పోర్టును తామేమి వ్యతిరేకించడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక్కడ విమానాశ్రయం రావడం సంతోషకరమన్నారు. ఎయిర్-పోర్టు రావడం వల్ల ఎంతైతే లాభపడుతున్నామో.. అంతకంటే ఎక్కువ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాకపోవడంతో ధర్నాకు దిగినట్లు వారు తెలిపారు. మార్కెట్ వాల్యూ ప్రకారమే రేట్ ఇస్తామని లేదా రైతులు కోరుకున్న చోటే వ్యవసాయ ఆమోద యోగ్యమైన భూములు ఇస్తామని మంత్రి సురేఖ చెప్పారని అన్నారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని కూడా మాట ఇచ్చినట్లు తెలిపారు. కానీ ఇప్పుడు భూములకు భూమి ఇవ్వకపోవడమే కాకుండా.. తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని కూడా మూసి వేస్తున్నారని.. అంతే కాకుండా కొత్తగా రోడ్డు మార్గానికి ప్రభుత్వం ఆసక్తి చూపించడం లేదని అన్నదాతలు వాపోయారు. తమకు కచ్చితంగా న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. తెలంగాణ రెండవ ఎయిర్-పోర్టుకు మార్గం సుగమం అయిన నేపథ్యంలో ఇక్కడ భూసేకరణకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం భూసేకరణ సర్వే చేయాలని నిర్ణయించారు అధికారులు. అయితే సర్వేను అడ్డుకునేందుకు రైతులు, మహిళలు పెద్ద ఎత్తున అక్కడకు తరలి వచ్చారు. కాసేపటి క్రితమే ఎయిర్ పోర్ట్ భూసేకరణ సర్వేకోసం హనుమకొండ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు అక్కడకు వెళ్లారు. దీంతో అధికారులను రైతులు, మహిళలు నిలదీశారు. తమకు న్యాయం చేయాలని అధికారులను నిర్వాసితులు అడ్డుకున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్‌తో వరంగల్ ఆర్డీవో, తహసీల్దార్ ఫోన్ లో సంప్రదింపులు జరుపారు. ప్రస్తుతం భూసేకరణ సర్వే తాత్కాలికంగా నిలిచిపోయింది.

# బీజేపీని నమ్మితే అమ్మేడు ఖాయం



- ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం
- నమ్మి ఓట్టేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి
- కార్మికుల ఆవేదన, ఆర్ధనాదాలు విపిపించడం లేదా : కేటీఆర్

**హైదరాబాద్,మార్చి4 :** బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్థనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది. కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ-వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పార్టీ మారిని వారితో రాజీనామా చేయించండి

**హైదరాబాద్, మార్చి 4 :** కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ప్రజాతీర్పు కోరాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆయన ఎక్స్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. భారాస నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ రాజీనామాలు చేయించి ప్రజాతీర్పు కోరాలని కేటీఆర్ అన్నారు. లేదంటే ఫిరాయింపుల గురించి, పార్టీ మారిన వెంటనే అనర్హులను చేసేలా రాజ్యాంగ సవరణ చేస్తామన్న ప్రచారాన్ని మానేయడం మంచిదని రాహుల్‌గాంధీకి సూచించారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవాలు

## రేవంత్ పతనం మొదలయ్యిందన్న లక్ష్మణ్



**హైదరాబాద్, మార్చి 4 :** కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట సంబరాలు వెల్లివిరిశాయి. ఈ కార్యక్రమంలో మల్క కొమురయ్యతో పాటు బీజేపీ రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు కే.లక్ష్మణ్ మాట్లాడుతూ.. మల్క కొమురయ్య గెలుపుతో రేవంత్ సర్కార్ పతనానికి నాంది పడ్డట్లు వ్యాఖ్యానించారు. 317 జీవోపై బీజేపీ అలుపెరగని పోరాటం చేసిందని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో మల్క కొమురయ్య మండలిలో వినిపిస్తారని అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని, ఉపాధ్యాయుల ఆవేదన ప్రభుత్వానికి తీవ్ర ఝలక్ ఇస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతోందనడానికి నిదర్శనమని కే.లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, పార్టీపై ఎదురు దాడులు చేయడం తగదని అన్నారు. తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. ఇక ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. తన విజయంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర, రాష్ట్ర పార్టీ నాయకత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో తనపై జరిగిన దుష్ప్రచారాలను తిప్పికొట్టిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పారు. తనను కార్పొరేట్ అభ్యర్థిగా ప్రచారం చేశారని.. కానీ, తాను ఎడ్యుకేషన్ సిస్టమ్ మీద పూర్తి పట్టుదలతో ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. 317 జీవో చాలా దుర్మార్గమైనదని, దానిపై తమ పోరాటం కొనసాగుతుందని మల్క కొమురయ్య హామీ ఇచ్చారు. విద్యాశాఖలో అనేక సమస్యలు ఉన్నాయని, ఉపాధ్యాయులు సతమతమవుతున్నారని, దానితో పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన అన్నారు. వీలైనంతవరకు ఉపాధ్యాయులతోనే ఉంటానని మల్క కొమురయ్య తెలిపారు.

# ప్రైవేట్ ఆస్పత్రులకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు

- బలవంతంగా మందులు అంటగడుతున్న ఆస్పత్రులు
- రాష్ట్రప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం




**న్యూఢిల్లీ, మార్చి 4 :** అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకంగా మారిందని విమర్శించింది. ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో మందులు కొనుగోలు చేయిస్తున్నాయంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తమ పార్మసీల నుంచి మందులు కొనుగోలు చేయాలంటూ.. రోగులను బలవంతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో రోగులు దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే పార్మసీలో స్వల్ప ధరకు లభ్యమవుతుంటే.. దానిని తమ పార్మసీలోనే కొనుగోలు చేయాలంటూ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులపై ఒత్తిడి తీసుకు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమైపోయిందంటూ వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించాలంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే గతంలో ఇదే అంశంపై పలు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వాటికి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, అరుణాచల్ ప్రదేశ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. క్రమంలో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధరల నియంత్రణపైనే తాము ఆధారపడతామని ఆయా రాష్ట్రాలు స్పష్టం చేశాయి. అత్యవసర మందులు అందుబాటు ధరల్లో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలు నిర్ణయించినట్లు తెలిపాయి. అయితే ఆసుపత్రిలోనే మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏమి లేదని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది.

# స్పీకర్‌కు హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్, మార్చి 4:** రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు ఇప్పటి వరకు ఎందుకు సమాధానాలు ఇవ్వలేదని స్పీకర్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు అసెంబ్లీ బిజినెస్ రూల్స్ 52(10) ప్రకారం.. రాతపూర్వ సమాధానాలు టేబుల్‌పై ఉంచాలని గుర్తు చేశారు. గత అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు ఇప్పటి వరకు సమాధానం రాలేదని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర నియోజకవర్గ ప్రయోజనాల కోసం సభలో ప్రశ్నలు అడగడం, సకాలంలో సమాధానాలు పొందడం సభ్యుల హక్కు అని ఆయన స్పష్టం చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానం ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని స్పీకర్‌ను హరీశ్‌రావు కోరారు.

# కొనసాగుతున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

## ముందంజలో ఉన్న బిజెపి అబ్యర్థి అంజిరెడ్డి




**కరీంనగర్, మార్చి 4:** కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా కొనసాగుతోంది. ఇప్పటికి వరకు 3 రౌండ్లలో 63వేల ఓట్లను అధికారులు లెక్కించారు. భాజపా అభ్యర్థి అంజిరెడ్డి ఆధిక్యంలో ఉన్నారు. భాజపా అభ్యర్థికి 23,310 ఓట్లు రాగా.. సమీప కాంగ్రెస్ అభ్యర్థికి 18,812 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 15,880 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం అంజిరెడ్డి 4,498 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇంకా దాదాపు 1,33,000 వేల ఓట్లు లెక్కించాల్సి ఉంది. ఏ అభ్యర్థి అయినా విజయం సాధించాలంటే 1,12,000 ఓట్లు రావాల్సి ఉంటుంది. ఇదే ట్రెండ్ కొనసాగితే మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలే అవకాశం లేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

# 15కిలోల బంగారం తరలింపు

## డిఆర్ఐ అధికారులకు పట్టుబడిన కన్నడ నటి



**బెంగళూరు, మార్చి 4 :** బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చారనే కారణంతో కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టు అయ్యారు. దుబాయ్ నుంచి ఆమె తీసుకొచ్చిన దాదాపు 15 కేజీల బంగారాన్ని బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాన్యా ఇటీవల తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండడంతో ఆమెపై నిఘా పెట్టారు. గత 15 రోజుల్లో 4 సార్లు దుబాయ్ వెళ్లొచ్చిన రాన్యా.. ఎలాంటి అనుమానం రాకుండా.. గోల్డ్ బిస్కెట్లను దుస్తుల్లో దాచి, తీసుకొచ్చేవారని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ప్రణాళిక ప్రకారం తాజాగా ఆమెను అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన ఓ పోలీసు అధికారికి రాన్యా బంధువని సమాచారం. డీఆర్ఐ అధికారులు ప్రశ్నించగా.. తాను డీజీపీ కుమార్తెనని చెప్పి.. ఇంటి వద్ద డ్రాప్ చేసేందుకుగానూ ఆమె పోలీసులకు కాల్ చేసినట్టు తెలిసింది. అసలు పోలీసు అధికారులతో రాన్యాకు సంబంధమేంటి? ఆ స్మగ్లింగ్‌లో వారి ప్రమేయం ఏమైనా ఉందా? అన్న కోణంలో డీఆర్ఐ అధికారులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు. కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మాణిక్య' చిత్రంతో తెరంగేట్రం చేశారు రాన్యా రావ్. ఆ తర్వాత 'వాఘా', 'పటాకీ' సినిమాల్లో నటించారు.

# ఎస్ఎల్‌బీసి చర్యల్లో ముందడుగు

## సొరంగంలో కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ



**నాగర్ కర్నూల్, మార్చి 4 :** నాగర్ కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం వద్ద సహాయక చర్యల్లో కీలక ముందడుగు పడింది. ఇటీవల 14వ కిలోమీటరు వద్ద సొరంగం పైకప్పు ఒక్కసారిగా కూలిన ఘటనలో 8 మంది సిబ్బంది అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన 11 రోజులకు టన్నెల్‌లోని కన్వేయర్ బెల్ట్‌ను సాంకేతిక సిబ్బంది పునరుద్ధరించారు. కన్వేయర్ బెల్ట్ పనిచేస్తుండటంతో బురద, మట్టి తొలగింపు పనులు వేగవంతం కానున్నాయి. 200 అడుగులు పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, సెగ్మెంట్, టీబీఎం శిథిలాలు ఉండటంతో ఇప్పటి వరకు ఆ 8మంది జాడ గుర్తించలేకపోయారు. దాదాపు 6 వేల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించాల్సి ఉందని అధికారులు అంచనా వేశారు.



# విస్తరణ దిశగా బీజేపీ అడుగులు!

మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం తరవాత బిజెపి ఏ మాత్రం తగ్గడంలేదు. ఢిల్లీ గెలుపును ఆకాశమంత చేసి ప్రచారం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందే జరిగిన వరుస ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడంతో ఇక బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జరుగుతున్న వేళ బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. బీహార్‌లోనూ సొంతంగా పాగా వేసేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బెంగాల్లో మరోమారు తమవంతుగా ప్రయత్నాలు చేపట్టారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు బిజెపికి అత్యంత ముఖ్యం. ఓ రకంగా చెప్పాలంటే బిజెపి ఎత్తుల ముందు కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేక పోతోంది. అంబేడ్కర్, రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ ఎంత రచ్చ చేసినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అలాగే బిజెపి ఎత్తులన్నీ కాంగ్రెస్‌ను పెద్ద దెబ్బకొట్టేలా ఉంటాయి. ఇవేవీ పెద్దగా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. బీజేపీ కూటమి వరుస విజయాలు బిజెపిని తిన్నగా కూర్చోనివ్వడం లేదు. అందుకే దక్షిణాదిలో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. తమిళనాడు, కేరళలో త్వరలో ఎన్నికలు రానున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే బీజేపీతో చేతులు కలిపేందుకు ఆయా రాష్ట్రాల్లో చిన్నాచితక పార్టీలు క్యూ కడుతున్నాయి. ఢిల్లీ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలకు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో ముమ్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. అందుకే టిడిపితో కలిసి అధికారం పంచుకుంది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు దక్షిణాదిలో బిజెపికి తురుపు ముక్క కానున్నారు. ఆయన సనాతన ధర్మం పేరుతో చేస్తున్న యాత్రలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్రనాయకత్వాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు. ఇలా ప్రతి అంశంపై చర్చించిన బీజేపీ పెద్దలు మార్గనిర్దేశనం చేయబోతున్నట్లు సమాచారం. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేసుకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసి చూపింది. బిజెపి రాజకీయాల తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు. మోదీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు బిజెపి అధ్యక్షపదవికి ఎన్నిక జరగాల్సి ఉంది. బలమైన నేతకోసం గాలిస్తున్నారు. పార్టీని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకుని వెళ్లగలిగే నేతకావాలి. దక్షిణాదికి చెందిన నేతల్లో ఒకరిని కూడా పరిశీంచే అవకాశం ఉంది. నిజానికి వెంకయ్యానాయుడు లాంటివారు పార్టీలో ఉండివుంటే అధ్యక్షపదవికి అవకాశం ఉండేది. దక్షిణాదిలో అలాంటి నేతలు లేరనే చెప్పాలి. తెలంగాణలో కూడా సమర్థుడైన, బలమైననేతను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాల్సి ఉంది. నిజానికి బిజెపి ఇప్పుడు మైనార్టీలో ఉంది. ముందుగా మెజార్టీ సాధించే ప్రయత్నాలు చేయడానికి మోడీద్వయం ఆలోచనచేస్తూ ఉంటుంది. ఎన్‌డిఎగా ఉన్నప్పటికీ సొంత బలం కోసమే బిజెపి ప్రయత్నాలు చేస్తుంది. అది కూడా ఈ యేడు మొదలు పెట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీని బలోపేతం చేయడం, అన్ని రాష్ట్రాల్లో అధికారం దక్కించు కోవడమే బిజెపి ముందున్న ప్రధాన లక్ష్యంగా చూడాలి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. ఇప్పటికే బిఆర్‌ఎస్, టీఎంసీ,డీఎంకే,ఎన్సీపీ, శివసేన ,ఎస్పీ, ఆర్జేడీ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నాయి. హిందీ వ్యతిరేకతతో తమిళనాడు సిఎం స్టాలిన్ తన స్థానం పదిలం చేసుకునే పనిలో ఉన్నారు. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని చూస్తున్నా.. ఎవరికి కాలం కలసి రావడం లేదు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం కోసం చూస్తున్నాయి. అయతే అది సాధ్యం కాదని ఇప్పటికే తేలింది.



# పులిపిల్లలతో సరదాగా ప్రధాని

## పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ
## వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని



**జామ్‌నగర్,మార్చి4 :** పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ ర్గి÷నైరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.




# భారత్‌లో టెస్లా పరుగులు ఖాయం

## ముంబైలో తొలి షారూమ్ కోసం ఒప్పందం

**ముంబై, మార్చి 4:** ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది. ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు అంటే చదరపు అడుగుకు రూ.900 గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణెలి వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన (ఇ÷ఎ) మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది. టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# అంబులెన్స్‌ను తనిఖీ చేసిన పోలీసులు



**హైదరాబాద్, మార్చి 4:** అంబులెన్స్ సైరన్ వినిపిస్తే.. ఎవరైనా సరే సైడ్ ఇస్తారు. ఎందుకంటే అందులోని బాధితుడు.. త్వరగా ఆస్పత్రికి వెళ్తే.. ప్రాణం నిలబడుతుందేమో ఆశ. అయితే అంబులెన్స్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు కొందరు. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడే అంబులెన్స్‌లను కొందరు తప్పుగా ఉపయోగిస్తున్నారు. వాటిని నడిపిస్తున్న డ్రైవర్లు, నిర్వాహకులు అంబులెన్స్‌ల ముసుగులో దందాలు చేస్తున్నారు. లోపల ఎవరు రోగులు లేకున్నా.. సైరన్ వేసుకుని ట్రాఫిక్ నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌లపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. దీంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. సైరన్ వేసుకొని కుక్కల్ని తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. హిమాయత్ నగర్ నుంచి మదినగూడ వైపు వెళ్తుండగా పంజాగుట్ట దగ్గర ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. పంజాగుట్ట ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. అంబులెన్స్ పేరుతో.. లోపల ఎలాంటి రోగులు లేకున్నా.. సైరన్ వేసుకుని ఎంచక్కా వెళ్లిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. అంబులెన్స్ వాహనాలకు ట్రాఫిక్ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించటంతో.. దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. గతంలో మిర్చి బజ్జి తినేందుకు అంబులెన్స్ డ్రైవర్ సైరన్ వేసుకొని వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు కుక్కలను తీసుకె ళ్తున్న అంబులెన్స్‌ను పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు.

# రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు

## సీఎం సన్నిహితుడు వేంనరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ చేయటానికి ప్రయత్నాలు

**హైదరాబాద్, మార్చి 4:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకోబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ చేయడానికి కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ ఎన్నిక వెనుక ఉన్న కథను చూస్తే, ఇది కేవలం ఒక ఎమ్మెల్సీ పదవి కోసం జరిగే పోటీ కాదనిపిస్తుంది. కొన్ని దశాబ్దాల క్రితం ప్రారంభమైన స్నేహం, అరెస్టులు, రివెంజ్ ల సమాహారంగా కనిపిస్తోంది. 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 'ఓటుకు నోటు' కేసు సంచలనం సృష్టించింది. అప్పుడు రేవంత్ రెడ్డి తెలుగు దేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా ఉండగా, వేం నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేయడం జరిగిందనే ఆరోపణలతో కేసు నమోదైంది. ఆ ఘటనలో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు. వేం నరేందర్ రెడ్డి రాజకీయంగా వెనుకబడ్డారు. అయితే, రాజకీయ సమీకరణాలు మారిన తర్వాత రేవంత్ కాంగ్రెస్‌లో చేరగా, వేం నరేందర్ రెడ్డి కూడా అదే బాటలో నడిచారు. అప్పటి నుంచి వేం నరేందర్ రెడ్డి %-% రేవంత్ రెడ్డికి నీడలా ఉండి ఆయన్ని అనుసరించారు. ఆ తర్వాత మారిన పరిణామాలతో కాంగ్రెస్ లో చేరిన రేవంత్ వేంటే వేం కూడా చేరారు. అప్పటి నుండి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పుడు ముఖ్యమంత్రి ఈ కాలంలో మొత్తం రేవంత్ వేంటే నీడై నడిచారు వేం నరేందర్ రెడ్డి. కనీసం ఎమ్మెల్యే టిక్కెట్ కూడా అడగకుండా ఎన్నికలను దగ్గరుండి రేవంత్ యాక్షన్‌ను ప్లాన్ చేశారు. ఈలోపే ఎన్నికలు వచ్చాయి సీఎంగా రేవంత్ రెడ్డి భాధ్యతలు చేపట్టారు. ఇక రేవంత్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేం నరేందర్ రెడ్డి చాలా కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే వేం నరేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహాదారుగా నియమించారు. అప్పటి నుండి పార్టీతోపాటు, ప్రభుత్వ కార్యకలాపాలు, సీఎం యాక్టివిటి అంత వేం నరేందర్ రెడ్డి అన్ని తానై చూసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిపికేషన్ రావడంతో ఇప్పుడు అందరి చూపు వేం వైపు మళ్లింది. అయితే తాజాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేయడానికి కసరత్తు ప్రారంభించింది. ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్‌ఎసకు వెళ్లే అవకాశముండగా, నాలుగింట్లో కాంగ్రెస్ పార్టీ పాగా వేయనుంది. దీంతో ఇప్పుడు స్నేహం కోసం అనే మాట మళ్లీ వినిపిస్తుంది. 5 ఎమ్మెల్సీలలో నాలుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీకి రానున్నాయి. దీంతో ఇప్పుడు ఒక ఎమ్మెల్సీని వేం నరేందర్ రెడ్డికి ఇవ్వడం పక్కా అనే ప్రచారం జరుగుతుంది. వేం నరేందర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి పెద్దల సభకు పంపడం ఖాయంగా కనిపిస్తోంది.

## పరీక్షలకు సర్వం సిద్ధం



జనత న్యూస్ బెజ్జంకి : ఇంటర్ పరీక్షలకు సంబంధించి బెజ్జంకి ప్రభుత్వ కళాశాల సెంటర్ C. NO. 47018లో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు చీఫ్ సూపరిండెంట్ ఆర్. సుమన్ రాజా కళ్యాణ్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఆర్. వెంకటరమణ మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం 8:30 ని : లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 9 గంటల లోపు మాత్రమే పరీక్ష హాలుకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలు 5-3-2025 నుండి20-3-2025 వరకు, సమయం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

## హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు అవసరం

**సిపిఎం బెజ్జంకి మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్.**



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల కేంద్రంలో మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు మండల సిపిఎం పార్టీ కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్ విడుదల చేసిన పత్రిక ప్రకటనలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఎలా అయితే సంక్షేమ బోర్డు ఉందో, అలాగే హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి, యాజమాన్యాల నుంచి వారికి రావలసిన న్యాయం విషయంలో అన్యాయం జరుగుతుందని, వెల్ఫేర్ బోర్డు ఉంటే సంఘటితంగా వారి సమస్యల పరిష్కారానికి బలం చేకూరుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సంగ ఎల్లయ్య, బొమ్మిడి సాయి కృష్ణ, కుంట సత్తయ్య, గాజె రాజు , గాజే లక్ష్మణ్, ఇంగే నరసింగం, తాటి చెట్టు రాజమల్లు, నిషాని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కేపీఎస్ విద్యార్థులకు ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ మేకింగ్ వర్క్ షాప్




కోరుట్ల, జనతా న్యూస్ : కోరుట్ల పబ్లిక్ స్కూల్ లో తెలంగాణ ఇన్నోవేటర్, వైజ్ఞానిక తపస్వి సెన్సార్ మల్లేశం ఆధ్వర్యంలో 3%తీ.ఁ ఒ 4 ప్ర% మార్చ్ రెండు రోజుల పాటు ఎల్ఈడి బల్బుల తయారీ చేయడం నిర్వహించినట్లు కోరుట్ల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ తెలిపారు, మన గ్రామంలో మన జిల్లాలో మన రాష్ట్రంలో మనదేశంలో ప్రొడక్ట్ తయారవుతే యువతకు ఉపాధి కల్పన జరుగుతుందని ఉద్దేశంతో మేకిన్ ఇండియా, లోకల్ ఫర్ లోకల్ ప్రోడక్ట్ కు ప్రాధన్యత ఇవ్వాలని నరేంద్ర మోడీ గారి పిలుపు మేరకు విద్యార్థులకు ప్రొడక్ట్ మేకింగ్ నేర్పిస్తే నిరుద్యోగ సమస్యతో బాధపడకుండా ఉపాధి కల్పించే స్థాయిలో ఎదుగుతారని ఉద్దేశంతో ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్ మేకింగ్ వర్క్ షాప్ ను నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాప్ లో దాదాపు 300 మంది విద్యార్థులు దాదాపు 500 ల ఎల్ఈడి బల్బులను స్వయంగా తయారు చేసుకొని ఇంటికి తీసుకువెళ్లడం జరిగింది ఈ సదస్సు లో విద్యార్థులకు లెడ్ బల్బ్ లో వాడే వివిధ కాంపౌండ్స్ పై అవగాహన పవర్ సేవింగ్ వివిధ అంశాలపై అవగాహన కల్పించిన మల్లేశం, కెపిఎస్ ప్రిన్సిపాల్ స్టూడెంట్స్ టీచర్స్ సత్కరించి కృతజ్ఞత తెలియజేయడము జరిగింది. ఇంకా ముందు ఎలాంటి నిత్య జీవితంలో ఉపయోగపడే రియల్లీస్టిక్ ప్రాక్టికల్ వర్క్షాప్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వెంకటేష్ తెలియజేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో.. బీజేపీ ముందంజ

**ఆధిక్యంలో అంజిరెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గట్టి పోటీ**

**మూడో స్థానంలో కొనసాగుతున్న బీఎస్పీ అభ్యర్థి హరికృష్ణ**

**కరీంనగర్ స్థానంలో కొనసాగుతున్న హెూరాహెూరీ**

**మొదటి ప్రాధాన్య ఓట్లలో ఫలితం తేలేది కష్టమే!**

**తప్పనిసరి కానున్న రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు**




కరీంనగర్, జనతా న్యూస్ : కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకున్న బీజేపీ.. ఇదే జిల్లాలకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కూడా ముందంజలో కొనసాగుతోంది. మంగళవారం రాత్రి 12 గంటల వరకు ఆరు రౌండ్లు లెక్కించగా.. బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి కన్నా 6,931 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. అయితే వరుసగా ఐదు రౌండ్లలో ఆధిక్యం కనబరిచిన బీజేపీ.. 6వ, 7వ రౌండ్లలో మాత్రం వెనకబడింది. ఆరో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి 211 ఓట్ల స్వల్ప ఆధిక్యం సాధించారు. ఇక ఏడో రౌండ్‌లో నరేందర్‌రెడ్డికి 600 పైచిలుకు ఓట్ల ఆధిక్యం లభించినట్లు తెలుస్తోంది. ఇంకా నాలుగు రౌండ్లు లెక్కించాల్సి ఉంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఈ నెల 3న ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా.. ఆ రోజంతా చెల్లని ఓట్లను విభజించి కట్టలు కట్టడానికే సరిపోయింది. మంగళవారం ఉదయం 11.30 గంటలకు అసలు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి మెం-త్తం 2,52,100 ఓట్లు పోల్ కాగా.. వాటిలో 28,000 ఓట్లు చెల్లుబాటు కానివిగా నిర్ధారించారు.మిగిలిన 2,24,100 ఓట్లను ఒక్కో రౌండ్‌లో 21,000 చొప్పున లెక్కిస్తున్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఆరు రౌండ్లలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 45,401 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 38,470 ఓట్లు లభించాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 31,481 ఓట్లు వచ్చాయి. కాగా, మరికొందరు ఇతరులు, స్వతంత్రులు స్వల్ప ఓట్లతోనే కొనసాగుతున్నారు. ముగ్గురు అభ్యర్థుల మధ్య హెూరాహెూరీ కొనసాగుతుండడంతో మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరూ కోటా ఓట్లను సాధించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు తప్పనిసరి అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ ఫలితాలు**

**8వ రౌండ్ ఫలితాలు**
1.అంజిరెడ్డి - 5907
(8 రౌండ్లు కలిపి (57626)
2.నరేందర్ రెడ్డి- 7077
(8 రౌండ్లు కలిపి (52910)
3.ప్రసన్న హరికృష్ణ - 6340
(8 రౌండ్లు కలిపి (44704)
4.రవీందర్ సింగ్ - 262
(8 రౌండ్లు కలిపి (1367)
5.మహమ్మద్ ముస్తాక్ అలీ - 360
(8 రౌండ్లు కలిపి (1859)
6.యాదగిరి శేఖర్ రావు - 384
(8 రౌండ్లు కలిపి (2731)
మొత్తం లెక్కించాల్సిన ఓట్లు 2,24,000
ఇప్పటి వరకు సుమారు 1,68,000 ఓట్లు లెక్కించారు.




**9వ రౌండ్ ఫలితాలు**
1.అంజిరెడ్డి - 6245
(9 రౌండ్లు కలిపి (63871)
2.నరేందర్ రెడ్డి- 6921
(9 రౌండ్లు కలిపి (59831)
3.ప్రసన్న హరికృష్ణ - 6290
(9 రౌండ్లు కలిపి (50994)
4.రవీందర్ సింగ్ - 273
(9 రౌండ్లు కలిపి (1640)
5.మహమ్మద్ ముస్తాక్ అలీ - 266
(9 రౌండ్లు కలిపి (2125)
6.యాదగిరి శేఖర్ రావు - 384
(9 రౌండ్లు కలిపి (3115)
మొత్తం లెక్కించాల్సిన ఓట్లు
2,24,000
ఇప్పటి వరకు సుమారు
1,89,000 ఓట్లు లెక్కించారు.

## వైభవంగా వెంకటేశ్వర కల్యాణోత్సవం





తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని శ్రీ ఆండాళ్ పద్మావతి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయ 46 వ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం శ్రీ ఆండాళ్ పద్మావతి సహిత గోదా వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగింది . ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన వెంకటాచార్యులు , గోవర్ధన శ్రీకాంత్ చార్యుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగ జరిగింది. కళ్యాణ మహెూత్సవంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను మృత్యుంజయ మహా దేవాలయం (శివాలయం) నుండిహెూఆలయ కమిటీ చైర్మన్ చల్లా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంఘం లక్ష్మణ్ రావు సమర్పించారు. ఉదయం ఎదుర్కోలు మహెూత్సవం జరుగగా, పద్మావతి కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణం మధ్యాహ్నం ప్రారంభమైంది. జిలకర బెల్లం సమర్పణ, మంగళసూత్రధారణ, మంచి ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆల అర్చకులు ఆశీర్వచనాలను అందించారు. కళ్యాణ మహెూత్సవంలో ఆలయ కమిటీతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో హాజరై కన్యాదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, చుట్టుపక్కల గ్రామాలతో పాటు కరీంనగర్ పట్టణం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఒంటెల రవిందర్ రెడ్డి, కోశాధికారి పోలు కిషన్,హహెూరం శ్రీనివాస్ రెడ్డి, వంటల ప్రసాద్ రెడ్డి, గంగారపు రమేష్, రాగి శ్రీనివాస్, కె వెంకటేశ్వర రావు, ప్రదీప్ గౌడ్, బట్టు కరుణాకర్, డిటిసి పురుషోత్తం, పీఏఓ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర రాజు, ఆర్టిఓ శ్రీకాంత్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలి

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ.**



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల కేంద్రంలో హరిజన సామాజిక వర్గ ఆధ్వర్యంలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ బోనాల పండుగకు మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు మానకొండూరు ప్రజలపై ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కర వేణి పోచయ్య, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ పులి సంతోష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఐలేని శ్రీనివాస్ రెడ్డి, జేరిపోతుల మధు,భైర సంతోష్, బోనగం రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ మృతులకు ఎక్స్ గ్రేసియా

**ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన జి. డబ్ల్యు.ఏ.సి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్.**



జనత న్యూస్ బెజ్జంకి : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల హామీలో భాగంగా గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, గల్ఫ్ లో మృతి చెందిన కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడం హర్ష నియమని సిద్దిపేట జిల్లా గల్ఫ్ సేవా సమితి అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్ మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నాలుగు కుటుంబాలకు ఎక్స్రేషియా అంద నుండగా, బెజ్జంకి మండలం బేగంపేటలో ఒక్క గల్ఫ్ కార్మిక కుటుంబానికి అందినట్లు పేర్కొన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభు త్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాన కొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు గల్ఫ్ కార్మికుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## సి.ప్రభాకర్ గ్రంథాలయాన్ని సందర్శించిన కోరుట్ల ఎమ్మెల్యే

కోరుట్ల, జనతా న్యూస్ : కోరుట్ల పట్టణంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయాన్ని కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల సంజయ్ సోమవారం రోజున సందర్శించారు ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉచితంగా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లో డీఎస్సీ (DSC) పరీక్షలకు చదువుకుంటూ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడారు ఎక్కువ శాతం మహిళలు ఈ పోటీ పరీక్షలలో ఉన్నారని వారికి తన వంతు సహాయంగా పుస్తకాలు అందిస్తామని వివరించారు గత రూపు ఇతర ఎంట్రన్స్ పరీక్షలలో పోటీపడి 18 మంది ఈ గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధించారని అలాగే మీరు కూడా ధైర్యంగా మంచి ఆలోచనతో చదువుకొని ముందుకు



రావాలని సూచించారు తదుపరి గ్రంథాలలో ఉన్నటువంటి అన్ని రకాల పుస్తకాలు,దినపత్రికలు, వార్తపత్రికలు, విజ్ఞాన సోపాలు అనేక రకాలైనటువంటి పుస్తకాలను సందర్శించారు ఉచితంగా విద్యార్థులకు సేవలందిస్తున్న సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయ కమిటీని అభినందించారు తదుపరి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని సాల్వతో సన్మానించారు కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు చెన్న విశ్వనాథం,అధ్యక్షులు రాస భూమయ్య,ఉపాధ్యక్షులు సుతారి రాములు,ప్రధాన కార్యదర్శి గోడికే రాజు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్నం రాధా, స్థానిక సర్పంచులు గోపం లక్ష్మీనారాయణ,అందె వంశీకృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## రాష్ట్రాల వైఫల్యం వల్లే ఔషధ ధరలు పెరిగాయి : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ప్రైవేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారిందని వ్యాఖ్యానించింది. ప్రైవేటు ఆస్పత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో కూడిన మందులను కొనుగోలు చేయిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై తాజాగా సుప్రీంలో విచారణ జరిగింది. తమ ఫార్మసీల నుంచే ఔషధాలు కొనుగోలు చేయాలని రోగులను బలవంతం చేయకుండా ప్రైవేటు ఆసుపత్రులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దానివల్ల రోగులు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. పిటిషనర్ వాదనతో సుప్రీం ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే చోట తక్కువ ధరకు లభిస్తున్నప్పుడు, దానిని తమ ఫార్మసీలోనే కొనుగోలు చేయాలని ప్రైవేటు ఆసుపత్రులు బలవంతం చేయకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార ఔషధాలు అందుబాటు ధరల్లో లభించడం కష్టమైపోయిందని వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడీకి గురికాకుండా రక్షించేందుకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇదే విషయమై గతంలో సుప్రీంకోర్టు రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చింది. వాటికి ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ధరల నియంత్రణ ఆదేశాలపైనే తాము ఆధారపడతామని పేర్కొన్నాయి. అత్యవసర ఔషధాలు అందుబాటు రేటులో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలను నిర్ణయించినట్లు తెలిపాయి. ఆసుపత్రిలోని ఫార్మసీలోని మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏదీ లేదని కేంద్రం కోర్టుకు సమాధానమచ్చింది.



## 'నా వల్లే లాలూ రాజకీయాల్లో ఎదిగారు' : నీతీశ్

**పాట్నా :** ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన అతనిపై సీఎం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో బిహార్‌లో అభివృద్ధి ఏమీ జరగలేదని, తన హయాంలోనే జరిగిందన్నారు. ఈ సందర్భంగా తన వల్లే లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లో ఎదిగారని వ్యాఖ్యానించారు. "గతంలో బిహార్‌లో పరిస్థితి ఎలా ఉండేదో గుర్తుందా? సాయంత్రం అయ్యిందంటే ఎవ్వరూ బయటకు వచ్చేవారు కాదు. నీవు చిన్నపిల్లాడివి. వెళ్లి ప్రజలను అడుగు. మీ నాన్న ఈ స్థాయిలో ఉన్నాడంటే అది నా వల్లే. లాలూకు ఎందుకు అండగా నిలుస్తున్నారని మీ సొంత మనుషులే అడిగారు. అయినప్పటికీ.. మద్దతు ఇచ్చా' అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన తేజస్వీ యాదవ్.. రాష్ట్రంలో అభివృద్ధి గురించి మాట్లాడారు. ఆదాయం లేనప్పటికీ బడ్జెట్ పెరుగుతూ పోతుండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను అబద్ధాల పుట్ట అని ఆరోపించారు. తన తండ్రి లాలూ ప్రసాద్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వంలో మాత్రం అన్నీ తప్పుడు లెక్కలేనని విమర్శించారు. ముఖ్యమంత్రి నీతీశ్ అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సమయంలో తేజస్వీ అడ్డుకునే ప్రయత్నం చేయగా.. తేజస్వీపై సీఎం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



## తల్లికి కడసారి నమస్కరించి పరీక్షకు వెళ్లిన విద్యార్థి..

**తిరునల్వేలి :** కొద్దిగంటల్లో పరీక్షకు వెళ్తామనగా తల్లి చనిపోతే.. చేయిపట్టుకొని నడిపించిన అమ్మ కానరాని లోకాలకు వెళ్లిపోతే.. జీవితం పెట్టిన ఆ పరీక్ష ముందు ఆ పసిమనసు విలవిల్లాడింది. తండ్రి అండలేదు.. సోదరి భవిష్యత్తు కళ్లముందు ఉంది. అందుకే కాలం వేసిన శిక్షకు లొంగిపోవద్దనుకున్న ఆ పిల్లాడు.. అడుగులు ముందుకేశాడు. చివరిసారిగా అమ్మ పాదాలకు నమస్కరించి ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్లాడు. హృదయాలను మెలిపెట్టే ఈ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. తమిళనాడు లో మార్చి 3 నుంచి ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. తిరునల్వేలిలోని వల్లియూర్‌కు చెందిన సునీల్ కుమార్ కొద్దిగంటల్లో పరీక్షకు వెళ్తాడనగా.. గుండె సమస్యతో అతడి తల్లి ఆకస్మికంగా చనిపోయింది. ఆరు సంవత్సరాల క్రితమే తండ్రిని కోల్పోయాడు. ఆ తల్లే సునీల్, అతడి సోదరిని పెంచి పెద్ద చేసింది. వారికి ఆమే ఆధారం. ఇలాంటి సమయంలో తల్లిని కోల్పోయిన ఆ పిల్లాడు ఎంతో వేదనకు గురయ్యాడు. కానీ బంధువులు, చుట్టపక్కలవారి ప్రోత్సాహంతో బాధ దిగమింగుకొని పరీక్ష రాయడానికి వెళ్లాడు. వెళ్లేముందు చివరిసారిగా తల్లిపాదాల వద్ద హాల్‌టికెట్ ఉంచి ఆశీస్సులు తీసుకున్నాడు. కానీ అప్పుడు తనను తాను నియంత్రించుకోలేక వెక్కివెక్కి ఏడ్చాడు. కానీ ఇతర సభ్యులు అతడిని ఓదార్చి, ఎగ్జామ్ సెంటర్ వద్ద దిగబెట్టారు. బాగా చదవాలని తల్లి కోరుకునేదని గుర్తుచేశారు. మరోవైపు సోదరి భవిష్యత్తు అతడి కళ్లముందు కదలాడింది. ఈ ఘటన తమిళనాడు ప్రభుత్వం దృష్టికి చేరింది. విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ బృందం సునీల్‌తో మాట్లాడింది. అవసరంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. ఒక సోదరుడిలా తోడుగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ హృదయవిదారక ఘటనపై సీఎం ఎంకే స్టాలిన్ ఎక్స్ వేదికగా స్పందించారు.

# ఖర్గేతో డీకే భేటీ.. సీఎం మార్పు జరగనుందా?



**బెంగళూరు:** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పదవి స్వీకరిస్తారంటూ గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆయన కాంగ్రెస్ జాతీయా ధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఊహగానాలు వెల్లువెత్తిన వేళ.. వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

**అందుకే ఖర్గేను కలిశా..** ఖర్గేతో తన సమావేశం ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశమని శివకుమార్ తెలిపారు. "ఆయన మా పార్టీ అధ్యక్షుడు. మా నాయకుడు. ప్రోటోకాల్ ప్రకారం ఆయనను నేను రిసీవ్ చేసుకోవాల్సి ఉంది. అందుకే ఖర్గేను కలిశా. బెంగళూరులో పార్టీ కొత్త కార్యాలయం శంకుస్థాపన కోసం ఆయనను ఆహ్వానించాం. ఈ సందర్భంగా ఆయనతో ఎన్నో విషయాలపై చర్చించా" అని డీకే వెల్లడించారు. కాగా.. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే బాధ్యతలు స్వీకరిస్తారంటూ చాలా రోజులుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకు ఆయన పార్టీ మారనున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం వీరప్ప మొయిలీ కీలక వ్యాఖ్యలు చేశారు. డీకే సీఎం కావడం ఖాయ మని.. దీన్ని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. ఆయన సీఎం పదవి చేపట్టడం అనేది కాలపరిమితితో కూడుకున్నదని, అయితే అది కచ్చితంగా జరుగుతుందన్నారు. వీరప్ప వ్యాఖ్యల పై స్పందించిన సహాయక మంత్రి కేఎన్ రాజన్న.. ఇది కేవలం మొయిలీ వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, దీనిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇదే విషయంపై డీకే మాట్లాడారు. ఈ ప్రకటనలు ఆయన వ్యక్తిగతమని.. ఖర్గే నిర్ణయానికి తాను కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ.. వీరప్ప చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ఖర్గేతో డీకే భేటీ కావడంతో.. ఊహాగానాలు మరింత జోరందుకున్నాయి. త్వరలో ఆయన సీఎం పీఠంపై కూర్చోవడం ఖాయమంటూ ప్రచారం కొనసాగుతోంది.

## భారత్‌తో మా సంబంధాలు బలంగానే ఉన్నాయి : బంగ్లాదేశ్



**బంగ్లాదేశ్ :** భారత్– బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలు క్షీణించాయనే వాదనలను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కొట్టిపారేశారు. ఢాకా, దిల్లీల మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయన్నారు. బీబీసీ బంగ్లాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయంపై మాట్లాడారు. 'భారత్–బంగ్లాల మధ్య సంబంధాలు బలంగానే ఉన్నాయి. అయితే, ఇటీవల కొన్ని విభేదాలు తలెత్తాయి. అవి వచ్చి పోయే మేఘాల్లాంటివి. తప్పుడు సమాచారం, దుష్ప్రచారాలే ఈ సంఘర్షణలకు కారణం. వీటిని తొలగించేందుకు, ఇరుదేశాల మధ్య సహకారాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మా అధికారులు నిరంతరం ఆ దేశంతో సంప్రదింపులు జరుపుతున్నారు' అని యూనస్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ క్రమంలోనే అక్కడున్న హిందూ మైనార్టీలపై దాడులు జరిగాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు తన ఆందోళనను వ్యక్తంచేస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఇరుదేశాల మధ్య సంబంధాలు బలహీనపడ్డాయి. అయితే, భారత్– బంగ్లాల మధ్య సత్సంబంధాలను కొనసాగించాలని భావిస్తున్నట్లు ఇరుదేశాలు పేర్కొంటూ వస్తున్నాయి. ఇదిలాఉండగా.. భారత్‌లో ఉన్న హసీనాపై బంగ్లాదేశ్‌కు చెందిన అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ గతంలో అరెస్టు వారెంట్ జారీ చేసింది. దీంతో ఆమెను తిరిగి రప్పించేందుకు అక్కడి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమెతోపాటు పలువురు మాజీ క్యాబినెట్ మంత్రులు, సలహాదారులు, మిలిటరీ అధికారులపైనా అరెస్టు వారెంట్‌లు జారీ అయ్యాయి. మరోవైపు.. దేశాన్ని అస్థిరపరిచే కుట్రదారులను, చట్ట ఉల్లంఘనలకు పాల్పడేవారే లక్ష్యంగా యూనస్ సర్కారు 'ఆపరేషన్ డెవిల్ హంట్'ను చేపట్టింది.

## రష్యాకు లొంగిపోయేలా చేయడానికే మిలిటరీ సాయం నిలిపివేత : కీవ్



**రష్యా :** రష్యాతో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో కీవ్‌కు సైనిక సాయం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఉక్రెయిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అగ్రరాజ్యం తమకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలు క్రమంగా తమ దేశాన్ని రష్యాకు లొంగిపోయేలా చేయాలనే ఉద్దేశంతో చేస్తున్నట్లు ఉన్నాయని ఆ దేశ పార్లమెంటరీ విదేశీ వ్యవహారాల కమిటీ చీఫ్ మెరెజ్‌కో ఆరోపించారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మధ్య వాగ్వాదం నెలకొన్న నేపథ్యంలో కీవ్‌పై ఒత్తిడి తీసుకురావడానికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని యూరోపియన్ దేశాలు ఆరోపించా యి. అగ్రరాజ్యం సాయం లేకుండా కీవ్ రష్యాతో పోరాటం చేయగలదా అని ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రకటన వెలువ డిన అనంతరం ఐరోపా దేశాల నేతలు అత్యవసర చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. జర్మనీ తదుపరి ఛాన్స్‌లర్‌గా బాధ్య తలు చేపట్టనున్న ఫ్రెడరిక్ మెర్జ్ అమెరికా ప్రకటనను వ్యతిరే కించారు. ట్రంప్ నిర్ణయం ఉక్రెయిన్ రక్షణ ప్రయత్నాలను మరింత బలహీనపరిచే ఉద్దేశపూర్వక చర్యగా ఉందని అన్నా రు. అగ్రరాజ్యం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఉక్రెయిన్‌కు ఇప్పటికే అందుబాటులో ఉన్న వందల మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలపై ప్రభావం పడనుందని ది న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. ట్రంప్‌తో సమావేశం అనంతరం జెలెన్‌స్కీ లండన్‌లో నిర్వ హించిన ఐరోపా దేశాధినేతల సమా వేశంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మాట్లాడు తూ.. అగ్రరాజ్యంతో ఖనిజాల ఒప్పందానికి తాము సిద్ధమేనని పేర్కొన్నారు. రష్యాతో యుద్ధం ముగింపు ఇంకా సుదూరతీరం లోనే ఉందని, అప్పటివరకు అగ్రరాజ్యం సహకారం అందు తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మిలిటరీ సాయం నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించడం గమనార్హం.

## యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేటు రంగం

### డిఫెన్స్ ప్యానెల్ క్లియరెన్స్



**న్యూఢిల్లీ :** భారత్‌లో యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేటు రంగం కూడా అడుగుపెట్టేందుకు మార్గం మరింత సుగమం అయింది. తాజాగా దీనికి సంబంధించి డిఫెన్స్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఈ మేరకు పలు సూచనలు చేసింది. తేలికపాటి యుద్ధవిమానం తేజస్ ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు ఐదుగురు సభ్యుల కమిటీని ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. ఇది తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. తాజాగా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. రక్షణ మంత్రి ఈ సూచనల అమలును దశలవారీగా చేపట్టాని తెలిపారని పేర్కొన్నారు. వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కొన్ని నెలల నుంచి భారత్‌లో తేజస్ ఉత్పత్తి, డెలివరీల్లో జాప్యంపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఓ పక్క వాయుసేన ఆపరేషనల్ స్క్వాడ్రన్ల సంఖ్య పడిపోతుండటంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కమిటీకి రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ అధ్యక్షతవహించారు. తాజాగా ఇది స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాలంలో తీసుకోవాల్సిన చర్యలతో తేజస్ తయారీల్లోని సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. ముఖ్యంగా ప్రైవేటు రంగాన్ని భాగస్వామిని చేయడంతో ఈ సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. వాయుసేన వచ్చే 20 ఏళ్లలో వివిధ వేరియంట్లకు చెందిన దాదాపు 350 తేజస్ విమానాలను వినియోగించాలని భావిస్తోంది. కానీ, అమెరికా నుంచి ఇంజిన్ల రాకలో జాప్యం, మందకొడి ఉత్పత్తి వంటి కారణాలతో ప్రణాళిక అమల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంది.

## రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచనున్న చైనా



**చైనా :** చైనా తన రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. గతేడాది 232 బిలియన్ డాలర్ల మేర రక్షణ బడ్జెట్‌ను ప్రకటించిన డ్రాగన్.. ఈ సారి దీన్ని మరింత పెంచేందుకు సిద్ధమైంది. శక్తిసామర్థ్యాల ద్వారానే శాంతి, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవచ్చని చైనా అభిప్రాయపడింది. ప్రధాని లీ కియాంగ్ ప్రధాన బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వేళ రక్షణ బడ్జెట్ పెంపు సమాచారం బయటకు వచ్చింది. చైనా తన సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసే పనిలో నిమగ్నమైంది. ఎయిర్‌క్రాఫ్టుల తయారీ, అత్యాధునిక సాంకేతిక కలిగిన యుద్ధ నౌకల నిర్మాణంతో సాయుధ దళాలను ఆధునీకరించే పనిలో పడింది. ఇందుకోసం ఏటా భారీగా ఖర్చు పెడుతోంది. గతేడాది 232 బిలియన్ డాలర్లతో రక్షణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 7.2శాతం ఎక్కువ. ఈ రక్షణ వ్యయంపై నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి స్పందిస్తూ.. బలమైన శక్తితోనే శాంతిని పరిరక్షించుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

## ఈయూతో కలిసి పని చేసేందుకు సిద్ధం : చైనా

**చైనా :** ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే విషయంలో అమెరికా, ఐరోపా సమాఖ్య మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఇదే అదునుగా భావించిన చైనా.. ఈయూతో తన సంబంధాలను మరింత పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అగ్రరాజ్యం తీసుకుంటున్న ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా ఈయూతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా పార్లమెంటు ప్రతినిధి లౌ కిన్‌జియాన్ మంగళవారం పేర్కొన్నారు. "గత 50 ఏళ్లుగా చైనా, యూరప్ మధ్య ఎటువంటి ఘర్షణలు లేవు. ఇరు వర్గాలు అనేక అంశాల్లో భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. చైనా ఉత్పత్తులకు, ఇక్కడ రూపొందించే ఏఐ అనుకూల ఇ–వాహనాల బ్యాటరీలకు ఈయూ దేశాలు లాభదాయకమైన మార్కెట్‌గా ఉన్నాయి. కాబట్టి ఆ దేశాలతో సంబంధాలు మరింత పెంచుకోవడానికి ఆసక్తితో ఉన్నాం" అని లౌ కిన్‌జియాన్ పేర్కొన్నారు. చైనా–యూరప్ సంబంధాలు ఏ మూడో పక్షాన్ని లక్ష్యంగా చేసుకోవని.. వాటిపై ఆధారపడి ఉండవని పరోక్షంగా అమెరికా ఐరోపా దేశాల సంబంధాలను ఉద్దేశించి అన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మీడియా ఎదుటే తీవ్ర వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోలను చైనా ప్రభుత్వం ఆధ్వర్యంలోని మీడియా సంస్థలు విపరీతంగా ప్రసారం చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో ట్రంప్–పుతిన్ మధ్య సయోధ్య పెరుగుతుండడం పట్ల బీజింగ్ ఆందోళన చెందుతున్నట్లు పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. వాషింగ్టన్‌తో మాస్కో జరుపుతున్న చర్చల గురించి జిన్‌పింగ్‌కు వివరించడానికి పుతిన్ తన ఉన్నత భద్రతా అధికారి సెర్గీ షోయిగును బీజింగ్‌కు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చైనా ఈయూ దేశాలతో సంబంధాలపై ప్రకటన చేయడం గమనార్హం.




## కశ్మీర్‌పై ఐరాస ప్రతినిధి వ్యాఖ్యలు.. తిప్పికొట్టిన భారత్

**న్యూఢిల్లీ :** ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ భారత్‌లోని మణిపుర్, కశ్మీర్ సమస్యలను ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిని భారత్ తరఫు ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తిప్పికొట్టారు. తమపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఇప్పటికే నిరూపితమైందని స్పష్టంచేశారు. జెనీవాలో జరిగిన 58వ మానవ హక్కుల మండలిలో గ్లోబల్ అప్‌డేట్‌పై టర్క్ మాట్లాడారు. 'మణిపుర్‌లో హింస, శాంతిస్థాపన వంటి పలు సమస్యలు పరిష్కరించడానికి వేగవంతంగా చర్చలు జరపాలని కోరుతున్నా. కశ్మీర్‌తో సహా పలు ప్రాంతాల్లో మానవ హక్కుల పరిరక్షకులు, స్వతంత్ర జర్నలిస్టులపై నిర్బంధ చట్టాలు విధించడం, పౌరులు తిరిగే ప్రాంతాలను వినియోగించుకోకుండా ఆంక్షలు పెట్టడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా. భారత దేశానికి ప్రజాస్వామ్యం, సంస్థలు అతిపెద్ద బలం. అవి ఆ దేశ అభివృద్ధికి, వైవిధ్యానికి ఆధారం. ప్రజాస్వామ్యాన్ని సమాజంలోని అన్ని స్థాయిల్లోనూ పెంపొందించాల్సిన అవసరం ఉంది' అని టర్క్ పేర్కొన్నారు. దీనిపై అరిందమ్ బాగ్చీ స్పందిస్తూ.. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం, శక్తివంతమైన దేశమని పేర్కొన్నారు. గ్లోబల్ అప్‌డేట్‌లో టర్క్ పేర్కొన్న నిరాధారమైన వ్యాఖ్యలు క్షేత్రస్థాయిలో విరుద్ధంగా ఉన్నాయన్నారు. భారత్‌పై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని దేశ ప్రజలు ఇప్పటికే నిరూపించారని స్పష్టంచేశారు. గ్లోబల్ అప్‌డేట్‌లో ఇలాంటి తప్పుడు సమాచారం ఉండటంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇతరులు చేసే వ్యాఖ్యలనే చెప్పాలనేటట్లు టర్క్ తీరు ఉందని బాగ్చీ ఆక్షేపించారు.

## మహారాష్ట్ర మంత్రి ధనంజయ్ ముండే రాజీనామా



**ముంబాయి :** మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో సర్పంచ్ దారుణ హత్య వ్యవహారం రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసులో ఆయనపై ఆరోపణలు రావడంతో మంత్రి పదవికి రాజీనామా చేయాలని ధనంజయ్ ముండేను సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆయన తన రాజీనామాను సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఫడణవీస్ మాట్లాడుతూ ముండే రాజీనామాను తాను ఆమోదించి.. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపానని మీడియాకు తెలిపారు. ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంలో కీలకనేత అయిన ధనంజయ్ ముండే సొంత జిల్లా బీడ్‌లో మసాజోగ్ గ్రామ సర్పంచి సంతోష్ దేశ్‌ముఖ్‌ను కిడ్నాప్ చేసి ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి చంపిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ హత్యోదంతానికి సంబంధించిన కేసులో మంత్రి సన్నిహితుడు వాల్మీక్ కరాడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు, మంత్రి ధనంజయ్ ముండేకు గట్టి మద్దతు ఇస్తున్న ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు, మంత్రికి వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను తాను సమర్పించినట్లు సామాజిక కార్యకర్త అంజలి దమానియా పేర్కొనడంతో మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్లు మళ్లీ మొదలయ్యాయి. ఎన్సీపీ (శరద్ పవార్) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే సైతం ధనంజయ్ ముండే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ధనంజయ్ మాట్లాడుతూ.. తనను మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్ లేదా డిప్యూటీ సీఎం అజిత్ పవార్ చెప్తే వెంటనే రాజీనామా చేస్తానన్నారు.





# కంగారూలపై ప్రతీకారం

## ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు భారత్

- విరాట్ కోహ్లీ సూపర్ ఇన్నింగ్స్
- టీమిండియా ఆల్‌రౌండ్ ప్రదర్శన

**దుబాయ్:** ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమ్‌ఇండియా ఫైనల్‌కు చేరింది. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి సెమీ ఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్.. 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 48.1 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఓటమికి కంగారూలపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. విరాట్ కోహ్లీ (84, 98 బంతుల్లో 5 ఫోర్లు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. శ్రేయస్ అయ్యర్ (45, 62 బంతుల్లో 3 ఫోర్లు) మరోసారి మంచి ప్రదర్శన చేశాడు. కేఎల్ రాహుల్ (42, 34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), హార్దిక్ పాండ్య (28, 24 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) రాణించారు. రోహిత్ శర్మ (28, 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (27, 30 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. శుభ్‌మన్ గిల్ (8) నిరాశపర్చాడు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా 2, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కూపర్ కనోలీ ఒక్కో వికెట్ పడగొట్టారు. మార్చి 9న ఫైనల్ మ్యాచ్ దుబాయ్‌లో జరగనుంది. బుధవారం సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగే సెమీ ఫైనల్-2లో విజేతగా నిలిచిన జట్టు తుది పోరులో భారత్‌తో తలపడనుంది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో కెప్టెన్ స్టీవ్ స్మిత్ (73, 96 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అలెక్స్ కేరీ (61, 57 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (39, 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), మార్నస్ లబుషేన్ (29), బెన్ ద్వార్షుయిస్ (19), జోష్ ఇంగ్లిస్ (11), నాథన్ ఎల్లిస్ (10), మ్యాక్స్‌వెల్ (7) పరుగులు చేశారు. భారత బౌలర్లలో మహ్మద్ షమీ 3, రవీంద్ర జడేజా 2, వరుణ్ చక్రవర్తి 2, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత్ వరుసగా మూడోసారి (2013, 2017, 2025) ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరడం విశేషం. 84 రన్స్ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

### మైలురాళ్లు కాదు
## జట్టు విజయం ముఖ్యం
**- కోహ్లీ**

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమ్‌ఇండియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌లో టీమ్‌ఇండియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన 265 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 48.1 ఓవర్లలో ఛేదించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లీ (84, 98 బంతుల్లో 5 ఫోర్లు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతను సెంచరీ చేసేలా కనిపించినా ద్వార్షుయిస్ బౌలింగ్‌లో ఆడమ్ జంపాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో భారత అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. మ్యాచ్ అనంతరం సెంచరీ మిస్ గురించి ప్రశ్నించగా.. తాను మైలురాళ్ల గురించి ఆలోచించనని పేర్కొన్నాడు. 'నేనెప్పుడూ అటువంటి (మైలురాళ్లు) వాటిపై ఫోకస్ పెట్టను. వాటి గురించి పట్టించుకోకుంటేనే అవి జరుగుతాయి. ఒకవేళ నేను సెంచరీ చేసుంటే మంచిదే.. కానీ, జట్టు విజయం అంతకంటే ముఖ్యం' అని కోహ్లీ అన్నాడు. వన్డేల్లో వయసు పెరిగే కొద్దీ మెరుగవుతున్నారా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'నాకు తెలియదు.. అది మీరే చెప్పాలి' అని విరాట్ వివరించాడు.



## ఐసీసీ వన్డే టోర్నీల్లో రోహిత్ శర్మ ప్రపంచ రికార్డు..

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా తొలి సెమీ ఫైనల్‌లో భారత్, ఆస్ట్రేలియా తలపడుతున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. భారత్ లక్ష్యఛేదనకు దిగగా.. రోహిత్ శర్మ (28బీ 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మంచి టచ్‌లో కనిపించినా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. జట్టు 43 పరుగుల వద్ద ఉన్నప్పుడు స్పిన్నర్ కూపర్ కనోలీ బౌలింగ్‌లో రోహిత్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అయితే, నాథన్ ఎల్లిస్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో రెండో బంతిని రోహిత్ ఫుల్ షాట్‌తో స్టాండ్స్‌లోకి పంపించాడు. ఈ సిక్సర్‌తో అతను ఓ ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐసీసీ వన్డే టోర్నీల్లో (వన్డే ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ) అత్యధిక సిక్సులు బాదిన క్రికెటర్‌గా రోహిత్ రికార్డుల్లోకెక్కాడు. వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ క్రిస్ గేల్ (64 సిక్సులు)ను అధిగమించిన రోహిత్ ఈ ఫీట్ సాధించాడు.

**ఐసీసీ వన్డే టోర్నీల్లో అత్యధిక సిక్సులు బాదిన క్రికెటర్లు**

రోహిత్ శర్మ – 65 సిక్సులు (42 ఇన్నింగ్సులు)
క్రిస్ గేల్ – 64 సిక్సులు (51 ఇన్నింగ్సులు)
గ్లెన్ మ్యాక్స్‌వెల్ – 49 సిక్సులు (30 ఇన్నింగ్సులు)
డేవిడ్ మిల్లర్ – 45 సిక్సులు (30 ఇన్నింగ్సులు)
సౌరభ్ గంగూలీ – 42 సిక్సులు.. (32 ఇన్నింగ్సులు)
డేవిడ్ వార్నర్ – 42 సిక్సులు (33 ఇన్నింగ్సులు)
ఇయాన్ మోర్గాన్ – 40 సిక్సులు (40 ఇన్నింగ్సులు)
ఏబీ డివిలియర్స్ – 39 సిక్సులు.. (35 ఇన్నింగ్సులు)
బ్రెండన్ మెక్‌కల్లమ్ – 36 సిక్సులు.. (39 ఇన్నింగ్సులు)

## అలాగైతే మోడలింగ్ పోటీలకు వెళ్లండి
### 'రోహిత్ ఊబకాయం' వ్యాఖ్యలపై గావస్కర్ చురకలు

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఊబకాయంపై కాంగ్రెస్ నేత షమా మొహమ్మద్ చేసిన పోస్టు పెద్ద దుమారమే రేపింది. కేంద్రంలోని అధికార భాజపా దీనిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఆమెను మందలించింది. షమా మొహమ్మద్ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. సర్వత్రా వ్యతిరేకత రావడంతో షమా తన సోషల్ మీడియా ఖాతా నుంచి ఆ పోస్టును తొలగించారు. అయితే, భారత క్రికెటర్లు సరిగ్గా ఆడకపోతే సద్విమర్శలు చేసే సునీల్ గావస్కర్ ఈ విషయంలో రోహిత్‌కు మద్దతు ఇస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు. క్రికెట్‌కు నాజూకైన ఆకృతి ఒక్కటే అవసరం లేదని, నాణ్యమైన ఆటతీరు కావాలన్నాడు. స్లిమ్‌గా ఉండేవాళ్లే కావాలనుకుంటే ఫ్యాషన్ షోలకు వెళ్లాలని విమర్శకులకు చురకలు అంటించాడు. "బ్యాటింగ్ చేయడం ముఖ్యం. క్రికెట్‌లో పరుగులు చేయడమే కీలకం. ఇతర అంశాలన్నీ తర్వాతే. నేను రన్నింగ్ రేస్‌లో రెండు రౌండ్లు కూడా పరిగెత్తలేను. అదే క్రీజ్‌లో పాతుకుపోయి బ్యాటింగ్ చేయమంటే రోజంతా ఆడతా. గతంలోనే నేనో మాట చెప్పా. మీకు నాజూగ్గా ఉండేవాళ్లే కావాలనుకుంటే మీరు (విమర్శకులను ఉద్దేశించి) మోడలింగ్ పోటీలకు వెళ్లండి. అక్కడ మీకు కావాల్సిన మోడల్స్‌ను ఎంపిక చేసుకోండి. అంతేకానీ, క్రికెట్‌లో ఇలాంటి విషయాలకు చోటే లేదు. ఆటను ఎంత బాగా ఆడగలరనేదే ముఖ్యం. గతంలో సర్ఫరాజ్ ఖాన్ గురించి కూడా ఇలాంటి వ్యాఖ్యలే వచ్చాయి. చాలాసార్లు కొందరితో మాటలు పడ్డాడు. కానీ, ఓ టెస్టులో భారత్ తరఫున 150౦ పరుగుల ఇన్నింగ్స్‌ను ఆడాడు. వరుసగా హాఫ్ సెంచరీలూ బాదాడు. ఇక అతడితో సమస్య ఏముంటుంది? క్రికెట్‌లో బాడీ సైజ్‌తో అవసరం లేదని భావిస్తా. ఇక్కడ మానసికంగా ఎంత బలంగా ఉన్నామనేది ముఖ్యం" అని గావస్కర్ తెలిపాడు.

**గౌరవం ఇవ్వలేరా?...** భారత జట్టు సారథి రోహిత్ శర్మకు మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ మద్దతుగా నిలిచాడు. "కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఎనిమిది నెలల కిందట టీ20 ప్రపంచ కప్ అందించిన సారథి. అలాంటి క్రికెటర్‌పై ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మధ్యలో వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదు. బాడీ షేమింగ్ చేయడం దారుణం. ఇప్పటివరకు అతడు సాధించిన దానికైనా గౌరవం ఇవ్వాలి" అని వెంకటేశ్ ప్రసాద్ పోస్టు పెట్టాడు.



## సిరాజ్‌తో డేటింగ్ వార్తలు.. స్పందించిన మహిరా శర్మ



భారత క్రికెటర్, హైదరాబాదీ ప్లేయర్ మహ్మద్ సిరాజ్ ప్రేమ వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. హిందీ బిగ్‌బాస్ ఫేమ్ మహిరా శర్మతో సిరాజ్ డేటింగ్‌లో ఉన్నాడంటూ కథనాలు వస్తున్నాయి. చాలా దగ్గరి సన్నిహితులు ఈ విషయాన్ని వెల్లడించారని పలు ఆంగ్ల సైట్లలో వచ్చింది. మహిరా చేసిన పోస్టుకు ఇన్‌స్టాగ్రామ్‌లో సిరాజ్ లైక్ కొట్టడంతో పాటు ఫాలో కావడం ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లు అందులో పేర్కొన్నాయి. ఈ ఊహాగానాలపై తాజాగా మహిరా శర్మ ఓ ఇంటర్వ్యూలో స్పష్టతనిచ్చారు. 'ఈ విషయంలో చెప్పడానికి ఏమీ లేదు.. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. అభిమానులు మనకు ఎవరితో అయినా సంబంధాలను పెట్టగలరు. నేను పనిచేసిన సహ నటులతో కూడా సంబంధాలు అంటగట్టారు. అటువంటి వాటిని నేను పెద్దగా పట్టించుకోను' అని పేర్కొన్నారు. ఈ ఊహాగానాలపై ఇప్పటికే ఆమె తల్లి సానియా శర్మ స్పందించారు. తన కుమార్తె సెలబ్రిటీ అయినందువల్ల ఎవరితో మాట్లాడినా ఇటువంటి వదంతులు పుడుతూనే ఉంటాయని.. వాటిని ఎవరూ నమ్మొద్దని కోరారు. మహిరా శర్మ 1997లో జమ్మూలో పుట్టింది. కొన్నాళ్లకు వారి కుటుంబం ముంబయికి షిఫ్ట్ అవడంతో అక్కడి బ్యాచులర్ ఆఫ్ ఆర్ట్స్‌లో డిగ్రీ పూర్తి చేసి.. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించింది. హిందీ టీవీ సీరియల్స్, షోలతో బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన బిగ్‌బాస్ 13తో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయింది. ఆ తర్వాత వెబ్‌సిరీసుల్లోనూ బిజీగా మారిపోయింది.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
Regional
బుధవారం 5 మార్చి 2025




## ప్రియుడితో తమన్నా బ్రేకప్?

స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ డేటింగ్ గురించి తెలిసిందే. ఏడాది కాలంగా ఈ జంట డేటింగ్ గురించి సోషల్ మీడియాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. రేపో మాపో పెళ్లి చేసుకుంటారని కూడా అభిమానులు భావించారు. కానీ ఇంతలోనే ట్విస్టు. ఈ జంట విడిపోయారని మీడియాలో కథనాలొస్తున్నాయి. ఆ ఇద్దరూ తమ సోషల్ మీడియా ఖాతాల నుండి జంటగా ఉన్న ఫోటోలను తొలగించారు. దీనితో వారి సంబంధం అధికారికంగా ముగిసిందని అభిమానులు భావిస్తున్నారు. రెడ్డిట్ కథనం ప్రకారం... విజయ్ -తమన్నా కొన్ని వారాల క్రితం తమ రిలేషన్ షిప్‌ని ముగించారు.. కానీ స్నేహితులుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటారు. ఈ ఇద్దరూ ప్రస్తుతం తమ కెరీర్‌లపై దృష్టి సారించారు. సినిమా షెడ్యూళ్లతో బిజీగా ఉన్నారు. విడిపోయిన విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించలేదు. కానీ సోషల్ మీడియాలు బ్రేకప్ ని ధృవీకరిస్తున్నాయి. ప్రస్తుతానికి ఈ జంట విడిపోయినా మంచి స్నేహితులుగా ఉన్నారని, వారి మధ్య ఎటువంటి ద్వేషం లేదని కూడా కథనాలొస్తున్నాయి. స్నేహపూర్వక సంబంధాన్ని కొనసాగించాలని భావిస్తున్నారని, కెరీర్ పైనే పూర్తిగా ఫోకస్ చేస్తారని పింక్ విల్లా తన కథనంలో వెల్లడించింది. ఆ ఇద్దరూ ఎందుకు విడిపోవాలని అనుకున్నారు? అంటే... వారి బిజీ షెడ్యూల్ లు చిక్కులు తెచ్చి పెడుతున్నాయని, అంతకుమించి పెద్ద కారణం ఏదీ లేదని కూడా టాక్ వినిపిస్తోంది.



## 15 ఏళ్లలో ప్రేమ, పెళ్లి, విడాకులు

### సమంత సినీజీవితంలో ఎన్నో మలుపులు

టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. స్టార్ హీరోయిన్‌గా ఓ రేంజ్‌లో పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత నాగ చైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. సంసారం సజావుగా సాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి అతని నుండి విడిపోయింది. ఇక ప్రస్తుతం సింగిల్‌గా ఉంటుంది. ఇక చైతూ నుండి విడిపోయిన తర్వాత సమంతకి మయోసైటిస్ అనే వ్యాధి బయటపడింది. చాలా రోజుల పాటు ఈ వ్యాధితో బాధపడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. అయితే చివరికి ఆ వ్యాధితో ధీటుగా ఎదుర్కొని మళ్లీ సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతుంది. అయితే సమంత సినిమాల్లోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2010లో విడుదలైన ఏ మాయ చేసావే సినిమా ద్వారా సమంత ఆరంగేట్రం చేసింది. ఈ మూవీ ఫిబ్రవరి 26,2010న విడుదలై పెద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో సమంతతో చైతూ జంటగా నటించాడు. ఈ మూవీ సమయంలోనే వారిద్దరి మధ్య ప్రేమ పుట్టిందని టాక్. అయితే ఏ మాయ చేశావే సినిమా విడుదలై 15 ఏళ్లు కావడంతో, సమంత సినీ జర్నీ కూడా 15 ఏళ్లు పూర్తి అయింది. ఈ సినీ ప్రయాణంలో సమంత.. అల్లు అర్జున్, ఎన్టీఆర్, పవన్ , మహేష్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించి అలరించిఆంది. తమిళంలో కూడా వరుస సినిమాలు చేసింది. చివరిగా సమంత తెలుగులో ఖుషి, తమిళంలో కాతువాక్కుల రెండు కాదల్ సినిమాల్లో నటించింది. ఈ సినిమాల తరువాత సమంత జీవితంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. విడాకులు, మయోసైటిస్ వ్యాధి , తండ్రి చనిపోవడం ఇలా సమంతని అనేక సమస్యలు చాలా ఇబ్బంది పెట్టాయి. ఇప్పుడిప్పుడే వాటి నుండి బయటపడుతున్న సమంత.. మా ఇంటి బంగారం అనే తెలుగు సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ద్వారా నిర్మాతగా కూడా పరిచయం కానుంది. ఈ క్రమంలోనే సమంత సినీ రంగంలోకి వచ్చి 15 ఏళ్లు పూర్తి కావడంతో తన ఇన్ స్టాగ్రామ్ లో ఫోటోలను పంచుకుంటూ కృతజ్ఞతలు తెలిపింది. జీవితంలో ఎన్నో సవాళ్లని ఎదుర్కొన్న సమంత ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది.



### టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న

## సోనాక్షి సిన్హా

హిట్టు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వం-సగా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు సుధీర్ బాబు. గతేడాది హరోంహర, మా నాన్న సూపర్ హీరో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇవి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ప్రస్తుతం జటాధర అనే సినిమా చేస్తున్నాడు. మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకి వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తుండగా.. తెలుగు, హిందీ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మార్చి 08 నుంచి సోనాక్షి జటాధర షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవలే హీరమండి: డైమండ్ బజార్ అనే వెబ్ సిరీస్‌తో వచ్చి సూపర్ హిట్ అందుకుంది సోనాక్షి.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com